ప్రగాఢ బ్రహ్మచర్యం ప్రచండ సాగరం

అతని కెవ్వరూ లేరు.

అమ్మ కడుపులో అయిదు నెల్ల గుడ్డుగా ఉండగానే తండ్రి పోయాడు.

అమ్మ కడుపులోంచి తను బయట పడగానే ఆవిడ కన్నుమూసింది.

అతని ముందెవ్వరూ పుట్టలేదు.

అమ్మా నాన్న కులాలు మరచి పెళ్ళి చేసుకున్నారు గనుక అయిన వాళ్ళందరూ దూరమైపోయారు.

ఆ విధంగా అతని కెవ్వరూ లేరు.

అనాథాశ్రమంలో పెరిగాడు.

ఆలనా పాలనా లేకుండా అడవిలో చెటు మాదిరి పెరిగాడు. జ్ఞానం తెలిసేవరకూ అతను అడవిలో ఉన్నట్టు

గానే ఉన్నాడు. ఎప్పుడో ఓసారి బాగా జ్వరం వచ్చి తగ్గుముఖం పడుతున్నప్పుడు "అమ్మలేని బతుకింతే!" అనుకున్నాడు.

అప్పట్నించీ అతనికి అమ్మగురించి దుఃఖంపట్టుకుంది. బిడ్డకు పాలిస్తున్న అమ్మ బొమ్మ, దూడపాలు తాగుతున్నపుడు బిడ్డ శరీరాన్ని ప్రేమగా నాలికతో స్పృశించే ఆవు రూపం, జోలపాటా, పసిబిడ్డ నవ్వూ అతని కప్పుడప్పుడూ బాధ కలిగించేవి.

అతను తూర్పుగోదావరిలో ఆమూలపాశర్లపూడిలో పుట్టాడు. ఆవూరు వెడితే అతన్నెవరూ గుర్తుపట్టరు. అతనా వూరు చూసి పాతికేళ్ళయింది. ఎప్పుడూ అక్కడికి వెళ్ళాలనిపించలేదు.

మనుషులతో కలిసి తిరగడం అతనికి మహాభయం. నలుగురున్న చోటచేరడు. ఎవరితోనూ మాట్లాడడు. తన కెవరూ లేరన్న దిగులు అతనికి నలుగురి ముందూ ఒక విధమైన భయాన్ని నేర్పింది. ఎవరి అనురాగాన్నీ రుచిచూడని దురదృష్టం అతనిలో విపరీతమైన "ఇన్‌ఫిరియారిటీ కాంప్లెక్స్"ను పెంచింది.

ముఖ్యంగా అతనికి ఆడవాళ్ళంటే భయం. ఆడపిల్లను చూస్తే అతను తాచుపామును చూచినట్టు జడుసుకుంటాడు.

ఆ విపరీతమైన భయంవల్ల అతనిలో ఆడవాళ్ళంటే ఒకి విధమైన అసహ్యంకూడా పేరుకుపోయింది.

అతను అనేక గండాలకు లోనై బతికున్నాడు. ఎప్పుడూ ఆలోచిస్తూండడంవల్ల తనలో తను మాట్లాడుకోడం అలవాటైంది. దానివల్ల పరధ్యానం నడిరోడ్డు మీద ఏదో ఆలోచిస్తూ, మాట్లాడుకుంటూ, బహిర జ్ఞానం లేకుండా నడుస్తూఉంటే, బస్సులూ, రిక్షాలు అతని మీదికి దూసుకుంటూ వచ్చేవి. తడబడేవాడు. చేతులూ, కాళ్ళూ రాసుకుపోయేవి. ఒకటి రెండుసార్లు అతను చావుకు అతి సమీపంగా వెళ్ళిపోయాడు. అదృష్టం బాగుంది గనక అతను బతికి బయటపడ్డాడు.

ఎవరో పుణ్యాత్ముడు. తానెవరో ఎవరికీ తెలీకుండా అతి గుప్తంగా అతని వెనక నిలబడి, అతన్ని బి. ఏ. వరకూ చదివించాడు. ఉద్యోగం కూడా వేయించాడు.

ఆఫీసులో అతనికి పెద్దపనేమి ఉండేదికాదు. ఏవో మామూలు ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండేవి. అదైనా అతను సరిగా చేసేవాడుకాదు, సవాలక్ష తప్పులు రాసేవాడు. రాస్తూ రాస్తూ మధ్యలో ఆగిపోయి ఏదో ఒక మాటకోసం తల బద్దలుకొట్టుకునేవాడు.

పాపం! అతనంటే ఎవరూ గౌరవం చూపించేవారు కాదు ప్యూనుకూడా అతనిమాట వినిపించుకొనేవాడు

కాదు. పైగా అతని ముఖంమీదే అందరూ విరగబడి నవ్వేవారు. అందుకని పైకి ఏమనేవాడు కాదుగాని, లోపల్లోపలే పిసుక్కు చచ్చేవాడు.

"నన్ను చూస్తే వీళ్ళంతా ఎందుకిలా ఎగతాళి చేస్తారు! నేనంటే వీళ్ళకింత లోకువెందుకు? నా ముఖంలో ఏమైనా దయ్యాలున్నాయా? నాకేం తక్కువైందని వీళ్ళంతా పగలబడి నవ్వుతున్నారు!" అంటూ ఆలోచించుకుంటూ గంటల తరబడి కూర్చునేవాడు.

ఆఫీసు టైమ్ అయిపోయినాగాని అతను యింటికి వెళ్ళేవాడు కాదు. చీకటి పడిపోయినా ఏదో ఆలోచించుకుంటూ కూర్చునేవాడు. తెరిచిన ఫైలు ఎదురుగానే ఉండేది. అక్షరం ముక్క రాసేవాడు కాదు. ఆలోచనలు మాత్రం పరిపరి విధాల పరుగులు పెట్టెవి.

కడకు వాచ్‌మన్ విసుగెత్తి "రాసింది చాలుగాని- ఇంక లేచి వెళ్ళు! అప్పుడే ఎనిమిదైంది. ఎంత పెళ్ళాం బిడ్డలు లేకపోతే మాత్రం ఇలా కూర్చుంటే ఎలా?" అంటూ కసురుకుంటె అప్పుడతను లేచి ఫైళ్ళు సర్దుకుని కాళ్ళీడ్చుకుంటూ రోడ్డుమీద పడేవాడు.

అతను టౌనుకు దూరంగా ఒక మురికివాడలో పూరు మూలగదిలో ఉంటాడు. అతనికి ఆ గదంటే చాలా యిష్టం.

ఆ గదిలో కూచుంటే ఎప్పుడు తెల్లవారిందో చీకటెప్పుడు ముసురుకు వచ్చిందో తెలీదు. ఆ గదికీ వెలుతురుకూ బద్ధ వైరం. గది ఎదుట, కిటికీకి బాగా దగ్గరగా నిలబడి బాగా ఎదిగిన అశోకవృక్షం ఉంది. దాన్ని చూస్తూ కూచుంటాడతను. వంకీలుతిరిగిన దాని ఆకులవొంకా, వాసనలేని సన్నటి పూలవొంకా చూస్తూ అతను సమాధిస్థితిలోకి వెళ్ళిపోతుంటాడు అతను రచయిత కావలసిందే? ఎందుకనో కాలేదు.

అతనికి ఈ సమాజంమీద కొన్ని విచిత్రమైన అభిప్రాయాలున్నాయి. సుఖంగా సంసారం చేసుకుంటూ, బ్రతుకులో అడుగడుగునా ఆనందం పండించుకుంటున్న వాళ్ళంటే అతనికిష్టంవుండదు. ఆడవాళ్ళు పిల్లల్ని కనడం వాళ్ళకి పాలివ్వడం అతనికి చాలా కష్టంగా ఉంటుంది. పెళ్ళిచేసుకోవడం అంటే వెధవపనులు చేయడానికి లైసెన్సు పొందడం అని అతను అభిప్రాయ పడతాడు. ఎవరైనా పసందైన ఓ పడుచు స్త్రీ నవ్వుతూ, పేలుతూ ఉన్నప్పుడు అతని ఆలోచన ఇలా సాగుతుంది—

"దీనికి ఒళ్ళు బాగా కొవ్వెక్కి పోయింది. ఏం చూసుకుని ఇదిలా మిడిసి పడుతోందో అర్థంకాదు. అసలు తప్పంతా ఈ వెధవముండదికాదు. దీని మొగుడు వెధవ కాబట్టి ఇదిలా ఎగిరెగిరి పడుతోంది. లేకపోతే ఇదెందుకిలా

ఒళ్ళంతా ఊపుకుంటూ నవ్వుతుంది! రాత్రిళ్ళు చేసే వెధవ పనులకి వీళ్ళంతా కుళ్ళికుళ్ళి ఏడవాలి లైటార్పేసి ఒకళ్ళ ఒంటిమీద ఒకళ్ళు చేతులు వేసుకుని-పైత్యం కాకపోతే-హాయిగా తిని పడుకోక- ప్రేమట: అనురాగమట: దాని పళ్ళెలా ఉన్నాయి...పైట జారింది కూడా తెలీకుండా ఎలా నవ్వుతోందో! దీనికి పళ్ళు ఊడిపోతే బావుణ్ను...

ఒక్కో-సారి అతని ఆలోచనలు అతనికే అయిష్టమైన ఘడియలు కూడా ఉన్నాయి.

"వాళ్ళేదో ఏడుస్తారు, మధ్య నాకెందుకు? వాళ్ళు దొళ్ళితేనేం- ఏడిస్తేనేం-" అనుకున్నపుడు అతనిమీద అతనికే కోపం వచ్చేది.

అతని దృష్టిలో మనుషులంతా పని చేయాలిగాని ఆనందం అనుభవించకూడదు. ఆనందం అనేది వ్యక్తిగత విషయం. అది పబ్లిగ్గా అనుభవించడం నేరం ఆడామగా కలిసి తిరగడం అతని దృష్టిలో ఘోరం. అసలు ప్రకృతిలోనే పురుషుడికీ స్త్రీకి గొప్ప తేడావుంది, వాళ్ళిద్దరూ కలిసి తిరుగుతున్నందువల్లనే ప్రపంచంలో యిన్ని అనర్థాలు ఏర్పడుతున్నాయి. వీళ్ళిద్దరిమధ్యా ద్వేషం రగులుకున్నంతకాలం జననాలుండవు, జనాభా సమస్య ఉండదు. అందుకే అతనికి పెళ్ళి నిషిద్ధంగా కనిపిస్తుంది. అతను పుట్టి బుద్ధెరిగి ఏ

పెళ్ళికి వెళ్ళలేదు. పెళ్ళి బాజాలకన్నా చావు చప్పుళ్ళే అతనికిష్టం.

కష్టాలు పడుతున్న వాళ్ళంటే అతను చాలా జాలి చూపిస్తాడు. బాధతో, అవమానంతో, ఆకలితో, కటిక దారిద్ర్యంతో, ఒంటరి తనంతో, అంగవిహీనత్వంతో ఎంతకూ తగ్గని జబ్బుతో అంగలారుస్తున్న జనమే నిజమైన మనుషులనీ, వాళ్ళు తనకు చాలా దగ్గర బంధువులనీ అత ననుకుంటాడు.

సినిమాలు, నాటకాలు, తాగుడు, జూదం అతనికి సరిపడవు. ఒళ్ళు కొవ్వెక్కిన జనం ఏం చేయాలో తెలీక పెళ్ళాంతోనూ మొగుడితోనూ విసుగెత్తి ఇలా పిచ్చెత్తి పోతారని అతను నమ్ముతాడు.

అతనికి ఇరవైయేళ్ళ వరకూ అతనేవో విధమైన పిచ్చి పిచ్చి ఆలోచనలతోనూ అభిప్రాయాలతోనూ కాలం గడిపేశాడు.

అతనికెందుకో ఆవాళ పార్కుకు వెళ్ళాలనిపించింది. చెట్లంటే అతనికిష్టం. పచ్చగా, అమాయకంగా, దొంగ వినయాలు చూపకుండా, చల్లదనాన్నిస్తూ, పూలూ కాయలుగా, మూగగా బతుకుతున్న చెట్లతో అతనెన్నో కబుర్లు చెప్ప గలడు.

సాయంకాలపు నీరెండ అతని నీడ మించి దూరంగా

దూకుతోంది పక్కనున్న గులాబి మొక్కతో అతను
ఏమిటో చెబుతున్నాడు. అతని చుట్టూ జనంలేరు. నీరెండ
క్రమంగా అలిసిపోతోంది.

ఓ ముసలాయన కొంచెం దూరంలో నిలబడి అతని
వంక చాలాసేపు పరీక్షగా చూశాడు. ఎంతకూ గులాబీ
చెట్టుతో అతని సంభాషణ పూర్తికాక పోయేసరికి విసి
గెత్తినట్టున్నాడు-లేదా తను వొచ్చిన పని తొందరగా
పూర్తి చేసుకోవాలను కున్నాడు ఒకసారి సకిలించాడు.
దగ్గాడు. గట్టిగా శబ్దం చేస్తూ ఆవలించాడు. అయినా
గులాబి మొక్కతో అతని సంభాషణ పూర్తికాలేదు. ముస
లాయన మూడడుగులు ముందుకునడిచి "ఏంవోయ్ శాస్త్రి
బావున్నావా?" అని పలకరించాడు.

శాస్త్రి సంభాషణ ఆగిపోయింది. ఉక్కిరి బిక్కి
రయ్యాడు. ఎదురుగ్గా ముసలాయనను ఎప్పుడూ తనుచూడ
లేదు. తనేదో సంబరంలో వుండగా ఏదో అన్నాడు. తని
ప్పుడు అనవలసిన డైలాగేమిటి?

"ఏవిటోయ్ అలా ఆశ్చర్యపోయి చూస్తున్నావ్!
నే నెవరనుకుంటున్నావ్?" అంటూ ముసలాయన అతనికి
దగ్గరగా కూలబడ్డాడు.

శాస్త్రి కొంచెం ఇబ్బందిగా ముఖం పెట్టాడు. కింద

గడ్డి పరకని తెంచాడు. దూరంగా విసిరేశాడు. మరో గడ్డి పరకని తెంచాడు. దూరంగా విసిరాడు. మరోటి తెంచాడు విసిరాడు మరొకటి...

"నీకో మేనమామ వుండాలి గుర్తుందా?"

"ఏవిటో యిదంతా?"

శాస్త్రి తల వాల్చుకుని తన పని చేసుకుంటున్నాడు.

అతని చుట్టూవున్న పచ్చ గడ్డిపరకల తలలు తెగిపోతున్నాయి.

ముసలాయన ఒకసారి నవ్వినట్టున్నాడు. ఏదో గర్ గర్ లాడినట్టయితే శాస్త్రి తలెత్తి చూశాడు.

ముసలాయన ముఖం కొత్తగా లేదు, రోజూ రోడ్డు మీదే ఎంతోమంది ముసలాళ్ళు కనిపిస్తూ వుంటారు. ఈ ముసలాయన ముఖం కూడా అదే మాదిరిగా వుంది. బట్ట తల. వున్న వెంట్రుకలు నెరిశాయి. కనుబొమ్మలు గుబురుగా తెల్లగావున్నాయి. పొడుగాటి ముక్కుకింద మెలితిప్పిన మీసాల పక్క వెడల్పాటి చెక్కిళ్ళ మధ్య పల్చటి పెదాలూ, అందమైన గడ్డం. ముసిలాయన బలం గొప్పదే! తెల్లటిబట్టలు.

"మీ పేరేమిటండీ?" అనడిగాడు శాస్త్రి.

ముసలాయన కనుబొమ్మలు కొంచెం కిందికి దిగి, సర్దుకున్నాయి. ఆయన చూపులు శాస్త్రి ముఖంమీద ఊగిసలాడాయి. రెండు క్షణాల తర్వాత ఆయన గుబురు మీసాలకింద చిరునవ్వు పుట్టింది.

"నా పేరేమిటని అడుగుతున్నావా? చెబుతాను. చెప్పకపోతే నీకెలా తెలుస్తుంది? నా పేరే కాదు. నీకు చెప్పవలసింది బోలెడంతుంది అంత దూరాన్నుంచీ వెదుక్కుంటూ వచ్చిందెందుకు? చెబుతాను గానీ ముందు గదికి పద! కడుపులో యింత పడితేగాని—"

శాస్త్రి పని కొంచెం యిరకాటంలో పడింది. "ముసలాడు ఘటికుడే" అనుకున్నాడు. అనుకోకుండా వచ్చి, తన తన్మయత్వాన్ని ఆయన తగలెట్టాడని అనిపించినప్పుడు అతనికి ముసలాయన మీద కోపం ముంచుకొచ్చింది.

అసలు ఆయనెవరో తెలియకుండా ఆయనకూడా తనెందుకు వెడతాడు? తనని చూసి ఎవరనుకుంటున్నాడో ఏమో!

ముసలాయన చేయందించాడు. లేవకూడదనుకుంటూనే శాస్త్రి లేచి నిలబడ్డాడు. నడవకూడదనుకుంటూనే నడిపించాడు. ఎంతో ప్రతిఘటించాలని గుంపి జంపీలు పడి.

ఏదో అడగాలని సతమతమైపోయి, నోరు విప్పనైనా విప్ప కుండా ముసలాడితో అడుగులు కలిపాడు.

ఆనాటి శాకపాకాలు అద్భుతంగా ఉన్నా శాస్త్రికి ఏం రుచించినట్టుగా లేదు. రెండు ముద్దలు అతి కష్టంమీద మింగాడు. నాలుగు మెతుకులు అటూ ఇటూ వెదికాడు మజ్జిగపోసుకుని వేచాడు. ముసలాయన ఇదేం పట్టించుకో లేదు. కుర్చీమీద బాసింపట్టు వేసుక్కూచుని, అడిగిందే అడుగుతూ కలిపిందే కలుపుతూ ఆ అవకాశం మరి రాద న్నట్లు, జీవితంలో తినడం తప్ప మరేమంత ముఖ్యమైన వ్యాపకం లేనట్లు, తానుకాక పోయినా శాస్త్రి అయినా డబ్బిస్తున్నందుకు లాభం చేకూరాలన్నట్లు ఎంతో కష్టపడి అతి ప్రయాస మీద అయిందనిపించాడు.

హోటలుకు గదికి అరమైలు దూరం. మధ్యే మార్గంలో ముసలాయన కథ ప్రారంభించాడు. శాస్త్రికి వినక తప్పింది కాదు.

ముసలాయనిది అప్పనపల్లె. శాస్త్రి పుట్టిన ఊరికి ఎంతో దూరం కాదు. ఆయన పేరు పూర్ణయ్య. చెల్లెలు కడుపున పండిన పంట శాస్త్రి. చెల్లెలు కులం కాని వాడి నెవడినో చేసుకుందని బంధువర్గం తమకుపట్టనట్టు ఊరుకుంటే పూర్ణయ్య చెల్లెలిని కనిపెట్టుకునుండి తల గొడుగు పోతే

తపించిపోయి, నెలలప్పుడు సంరక్షణబాధ్యత స్వీకరించికన్న తెరవని తనను ఏం చేయాలో తెలీక, కడకు అనాథాశ్రమానికి తీసికొచ్చినట్టు ముసలాయన చెబుతున్నప్పుడు శాస్త్రికి ఎవరిమీద ఏవిధమైన కోపం రాలేదు. అతను మాత్రం ఒకసారి తలెత్తి ముసలాయన ముఖంలోకి చూశాడు.

“నీకు తెలీదు—నువ్వు నమ్ము... నమ్మకపో, ఆది నుంచి ఇప్పటిదాకా నిన్ను అన్నివిధాలా చూసుకొస్తున్నాను. నువ్వు చదూకోడానికి, ఉద్యోగంలో చేరడానికి మైనరుగారని ఆయనే కారణం, ధర్మాత్ముడు చచ్చి ఎక్కడున్నాడో గాని, నిరుడు ఆయన కన్నుమూసేదాకా నీ విషయంలో చెప్పలేనంత శ్రద్ధ కనబర్చాడు పాపం! ఆయనకీ మీ అమ్మంటే ఎంతో అభిమానం.”

శాస్త్రికి శరీరం చచ్చిపోయినట్టనిపించింది. శరీరం చచ్చిపోవడమంటే ఏమిటో అతనికి తెలీదు, పూర్ణయ్య ఆఖరున చెప్పింది విన్నప్పుడుమాత్రం శాస్త్రి మనసు కష్టపడింది. ఆ అభిమానం ఎటువంటిదని అడుగుదామనిపించింది గాని అతనికి నోరు పెగల్లేదు.

“ఏమైనా - నువ్వదృష్టవంతుడివోయ్ !” అన్నాడు పూర్ణయ్య.

తను అదృష్టవంతుడు!

ఏ విషయంలో?

తండ్రిముఖం, కన్నతల్లి అనురాగం తనెరగడు. నా అన్న వాళ్ళెవరూ లేకుండా తనిన్నాళ్ళూ బతికాడు. ఎవరో డబ్బు పంపించారు, తను చదువుకున్నాడు. ఎట్లానో ఉద్యోగంలో చేరాడు. ఇంతవరకూ తను ఎవరి ఆధారాన్నీ పొందలేకపోయాడు. అట్లాంటి తను అదృష్టవంతుడు.

అతనికోసారి పగలబడి నవ్వాలనిపించింది. ఆ వెనకనే జుత్తుపీక్కుంటూ ఎడారిలాంటి ఇసకలో కూలబడిపోయి, ఆకాశంవంక చూస్తూ ఏడవాలనిపించింది. అయినా, అతనేం చేయలేదు. నింగినీ, నేలనూ, ప్రక్కనే నడుస్తున్న మనిషినీ చూశాడు.

గది తాళం తీశాడు, స్విచ్ వేశాడు. లైటు వెలుగులో గదినీ: గదిలోని సామాగ్రినీ పరీక్షగా చూశాడు పూర్ణయ్య.

“ఈ గదిలోనా నువ్వుండేది?” అని అడిగాడు పూర్ణయ్య.

ఆ ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో శాస్త్రికి అర్థంకాలేదు. మిడుతూ మిడుతూ చూశాడు. ఊరికే తలూపాడు.

గదిలో పెద్ద సామగ్రీలేదు. కిటికీలో అద్దం, షేవింగ్

బ్రష్, రేజర్, వాడేసిన బ్లేడులు, విరిగిన పెన్సిలొకటి రెండు బస్ టిక్కెట్లు ఉన్నాయి ఆ గదిలో అలమారాలేదు. గదికి ఓ మూల ఒక చెంబూ గ్లాసూ వున్నాయి ప్రక్కనే తుంగ చాపుంది. అందులో పక్క దుప్పట్లున్నాయి. తుంగ చాపలోంచి మాసిన దుప్పటి అంచుమాత్రం బయటికి వేలాడుతూ వెక్కిరిస్తోంది. మరోమూల ఏవో నాలుగైదు పుస్తకాలు పడున్నాయి. ఒక ప్రక్క ఆ మూలనుంచి ఈ మూలకి కట్టిన తాడుమీద వేలాడుతున్న మాసిన బట్టలు ముక్కకంపు గొడుతున్నాయి. గదితుడిచి ఎన్నాళ్ళయిందో తెలీదు. ఆకులూ, కాగితం ముక్కలూ దుమ్మూ ధూళి గది నిండా పరచుకున్నాయి.

శాస్త్రి తుంగచాపపరచి, గుమ్మానికి దగ్గరగా లాగి దుప్పటి పరిచాడు.

"మీరిక్కడ పడుకోండి" అన్నాడు.

"మరి నువ్వో?" అన్నాడు పూర్ణయ్య.

"బయట అరుగుమీద పడుకుంటాను" నడుం వాల్చాడు పూర్ణయ్య.

"నిన్ను తీసుకు వెడదామని వొచ్చాను. నిన్ను చూస్తే అమ్మని చూసినట్టుంది. అది బతికుంటే ఎంత సంతోషించేదో! రేపు దరఖాస్తు రాసిచ్చి శెలవు శాంక్షన్ చేయించుకో పదిరోజులుండి వొచ్చేద్దుగాని."

శాస్త్రి అవునని గాని కాదని గాని ఏం చెప్పలేదు. దుప్పటి తలగడా పుచ్చుకుని లైటార్పి బయటరుగుమీదికి వొచ్చాడు.

చెట్టుకిందజేరి, ఆలోచనల్లో మునిగిపోయాడు. ఆ చల్లని రాత్రివేళ హాయిగా గాలివీస్తున్నప్పుడు ఎంతకూ చిక్కబట్టుకోలేని గుండెల్లో విలన్‌లాగా దాపరించిన పూర్ణయ్య ఏదో గారడీచేసి ఒక దారిలో నడిచిపోతున్న జీవితాన్ని తలకిందులుచేసి బరువునీ బాధ్యతనీ తనమీదికి తోసేసి, తన్నెందుకూ కొరగానివాణ్ని చేస్తాడేమోనన్న భయంతో ఉక్కిరి బిక్కిరౌతున్నాడు.

ఎప్పుడో నిద్రపట్టింది. మెలకువ వచ్చేసరికి తన చుట్టూ వెలుగు వ్యాపిస్తోంది. పక్కమీద అశోకవృక్షం ఆకులు రాలి పడున్నాయి. నూతిదగ్గర అంట్లు తోముతున్న చప్పుడు వినిపిస్తోంది. పక్కింటి నాయుడుగారి కోడి అప్పుడే లేచినట్టుంది. "కొక్కొరోకో" అని అరిచింది. బధకంగా కళ్ళు మూతలు పడబోతున్నాయి. అటువంటప్పుడు అతనికి పూర్ణయ్య తన గదిలో పడుకున్న విషయము గుర్తొచ్చింది. ఎక్కడ బధకం అక్కడికి రెక్కలు కట్టుకు పారిపోయింది. లేచి కూచున్నాడు, గదిలోకి చూశాడు. గదిలో పూర్ణయ్య లేడు. శాస్త్రి గుండె జల్లుమంది. అంతకు రెండు రోజులకు

ముందే తను జీతం అందుకున్నాడు. కడకు జరిగిందిదన్న మాట!

"ఏవోయ్ లేచావా?" అంటూ పలకరించాడు పూర్ణయ్య-అరుగుమీద తన పక్కన కూచుంటూ. శాస్త్రి తలెత్తలేకపోయాడు.

"రాత్రి నేను చెప్పింది జ్ఞాపకం వుందికదూ! రేపు మనం బయలుదేరుతున్నాం ఇవాళ శలవు శాంక్షన్ చేయించుకో."

ఏవిటది? ఈయన తనను వదిలేట్టులేడు. తనపాలిటి కీయన మిలిటరీ ఆఫీసరులాగున్నాడు. ఏమైనాసరే తను శలవు పెట్టడు. ఎంత బలవంతపెట్టినా తను పాశర్ల పూడి ముఖం చూడడు అంతే!

అవాళ ఆఫీసుకు చేరుకోడం కొంచెం ఆలశ్యమైంది. దానికితోడు పనెక్కువగా ఉంది. కాగితాలతో యుద్ధం చేస్తూ కాలాన్ని మరిచిపోయాడు శాస్త్రి.

ఒంటిగంటదాటాక కాబోలు, తన కుర్చీ పక్క ఎవరో నిలబడి ఉండడం చూచి తలెత్తాడు. ఎవరో కాదు— పూర్ణయ్య.

"మీ అసిస్టెంటు సెక్రటరీతో మాట్లాడాను. పది రోజులు శలవిస్తానన్నాడు. ఇదిగో—అప్లికేషన్ సైను చేయించాను. సంతకం పెట్టు" అన్నాడు పూర్ణయ్య.

శాస్త్రికి ఏమనాలో తెలీలేదు. కసిగా కాగితాన్ని అందుకుని బరబరగీకి పూర్ణయ్యమీదికి విసిరేశాడు.

సంతకం చేసింతరువాత శాస్త్రి తనను తను తిట్టుకున్నాడు. తన అసమర్ధతని తిట్టుకున్నాడు.

"వీడు నన్ను బతకనిచ్చేట్టు లేదు. ఊరికి తీసికెళ్ళి వీడేదో చేస్తాడు అక్కడ నాపీక పిసికితే నేనేం చెయ్యాను! ఓరి భగవంతుడా! ఈ ఆపద తప్పించవా? నువ్వు కాకపోతే మరెవ్వరు తప్పిస్తారు? నువ్వు నన్ను పరీక్షిస్తున్నావు నేనేం చేయాలి?"

ఆ తరువాత అతను కుర్చీకి జారగిల బడిపోయి గొణుక్కోవడం ప్రారంభించాడు.

ఆఖరు నిమిషం వరకూ అతను పూర్ణయ్యకూడా వెళ్ళకుండా ఉందామని పోరాడేడు. ఏదో కుంటిసాకు చెబుదామను కునేవాడు.

కానీ, నోరెత్తడానికి భయపడేవాడు. ఆ మర్నాడు అతనెక్కడికైనా పారిపోదామని కూడా అనుకున్నాడు. చివరికి ఉదయం ఎనిమిదిగంటలకి వాళ్ళిద్దరినీ తీసుకుని బస్సు బయులుదేరింది.

నరసాపురం రేవుదాటి తిరిగి మరో బస్సెక్కి పాశర్లపూడి చేరుకునే వేళకు సాయంకాలం దాటింది. వాళ్ళిద్దరూ

రెండెడ్ల బండిమీద పూర్ణయ్య స్వగ్రామానికి బయలు దేరారు.

శాస్త్రికి ఒంటిమీద స్పృహ లేదు. ఏదో గొప్ప ప్రమాదం జరగబోతోందని విని మూర్ఛపోయినవాడిలాగా ఉన్నాడతను. అతనిలో ఓమూల అనుమానం ఒకటి మొలకెత్తి క్షణక్షణానికి పెద్దదిగి పోతోంది.

గుమ్మంలో బండి ఆగి ఆగగానే గుమ్మటంలా ఉన్న ఒకావిడ ఎగిరెగిరి పడుతూ వచ్చింది.

"వచ్చావటయ్యా! బుద్ధిమంతుడివి, ఎప్పుడో పసిబిడ్డగా చూశాన్నిన్ను! మళ్ళీ ఇన్నాళ్ళకి..." అంటూ ఆవిడ పనస ప్రారంభించింది.

పూర్ణయ్య నోరింత చేసుకుని అరవడం లంకించుకున్నాడు - "అందంతా సరే లేవే ముందల్లుడ్ని దిగనీ... దిగనిస్తావా లేదా?"

ఆవిడ అల్లుడు చేయందుకుని "జాగ్రత్తగా దిగు నాయనా!" అంది.

శాస్త్రి ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ ప్రాకినట్లయింది. ఆడదాని స్పర్శ ఎరుగని వాడతను ఆమె వయస్సు దాదాపు నలభై ఏళ్ళుండవొచ్చు. అయినా పాతికేళ్ళ దానిలా వుంది. బొద్దుగా చక్రాలంత కళ్ళతో, చిరునవ్వుతో

ఒక స్త్రీ తను భూమ్మీద దిగడానికి చేయందిస్తున్నప్పుడు శాస్త్రి శరీరం గజగజ వణికింది.

"ఎంత మేనత్తయితే మాత్రం...ఛీ!" అనుకుని చేయి విదిలించుకోబోయాడు. ఆవిడ వొదల్లేదు. అతన్ని మెల్లగా మెట్లమీదకి నడిపించుకు వెళ్ళి, కాళ్ళుకడుక్కోడానికి, దాహానికి నీళ్ళిచ్చింది.

"రాజ్యం: అలా నడవాలో కుర్చీ వాల్చు, అబ్బాయి కాస్సేపు కూర్చుంటాడు" అని పురమాయించాడు పూర్ణయ్య.

వాలుకుర్చీలో నడుం చేర్చాడు శాస్త్రి.

సాయంకాలపు నీరెండ క్రమంగా విరిగిపోతోంది. అతనికి అశోక వృక్షం గుర్తొచ్చింది. అయ్యరు గుర్తొచ్చాడు. అన్నిటినీ మించి—అత్తయ్య స్పర్శ గుర్తొచ్చింది తలెత్తి చూస్తే ఆవిడ పక్కనే నిలబడుంది, భుజమ్మీద చెయ్యేసి, కళ్ళలోకి చూస్తోంది.

"లే బాబూ! స్నానం చేద్దుగాని" అంటూ భుజాలు పట్టి లేవదీసింది.

ఆ మరునాటి మధ్యాహ్నం కందిపచ్చడి, మెంతి పులుసుతో భోజనం కొంచెం బరువైంది. దాంతో శాస్త్రికి అద్భుతమైన నిద్రపట్టింది. మెలకువొచ్చేసరికి, ఎవరిదో ఒక గంభీర కంఠస్వరం తనకతి సామీప్యంగా వినిపిస్తోంది.

"బేషుగ్గా ఉంది. రేపు రాత్రి 12 గంటల 48 నిమిషాలకు వృషభలగ్న ముహూర్తం. మరి పదిహేను రోజుల వరకూ ముహూర్తాలు లేనే లేవు. శుభస్యశీఘ్రం అన్నారు పెద్దలు"

శాస్త్రి గుండెల్లో రాయి పడింది. ఏమిటిది? రేపు రాత్రి 12 గం॥ 48 ని॥లకు ముహూర్తం. అతనికి తలదిమ్మెక్కిపోయింది. రెండు తుమ్ములు తుమ్మాడు.

"అల్లుడు లేచినట్టున్నాడు రెండుతుమ్ములు శుభాన్ని సూచిస్తున్నాయి - మరి నేవెళ్ళొస్తాను పూర్ణం!"

పూర్ణయ్య లోపలికొచ్చాడు. ఆయన్ని చూస్తే భయం వేసింది. శాస్త్రికి?

"లేచావోయ్—లే—లేచి ముఖం కడుక్కో! ఇప్పుడే పురోహితుడొచ్చాడు.

ముహూర్తం నిర్ణయం కూడా అయింది. రేపు రాత్రికి బేషుగ్గా ఉందంటున్నాడాయన ఏదో-ఇది అయిందనిపిస్తే నా బరువు తీరిపోతుంది..."

అసలు జరుగుతున్నదేమిటో శాస్త్రికి అంతుపట్టలేదు నిలువు గుడ్లేసి చూస్తూ కూర్చుండిపోయాడు.

"ఒక్కగానొక్క-పిల్ల. ఇంక నాకెవ్వరున్నారు? స్వార్జితం పదిహేనెకరాలూ, ఈ కొంపా మీవే. మేం బతికినన్నాళ్ళూ ఇంత తింటాం. ఆ తరువాత మీ యిష్టం."

శాస్త్రికి గుక్క తిరగలేదు. అసహ్యంతో అతని మనసు నిండిపోయింది. తనకు పెళ్ళి! పిల్ల ఎలాగుంటే తన కేమిా. ముహూర్తం మాత్రం నిర్ణయమైపోయింది తనసలు పెళ్ళి చేసుకోదలచుకోలేదు. పెళ్ళి చేసుకున్న మగాళ్ళంతా ఎలా బతుకుతున్నారో తనకు తెలుసు. తెలిసి తెలిసే తనీ సముద్రంలో దూకలేడు. పెళ్ళిచేసుకున్న మగాళ్ళంతా పురుగుల్లాగా, దోమల్లాగా, బానిసల్లాగా సిగ్గు ఎగ్గు విడిచేసి బతుకుతున్నారు. వాళ్ళకి పౌరుషం లేదు. పెళ్ళాం నవ్వితే చాలు వాళ్ళు తమని తాము మరిచి పోతారు మంచి చెడ్డా, పగలు రాత్రి చూడరు. తను వాళ్ళ మాదిరిగా బతకలేడు. తనకి స్వతంత్రం కావాలి. ఒకరి జోలి శొంఠి, తనకక్కర్లేదు. ఆకలేస్తే తింటాడు. నిద్రొస్తే పడుకుంటాడు. కాని-పెళ్ళయితే ఏమాతుంది? స్వతంత్రం ఉండదు. ఇష్టా యిష్టాలుండవు

తను పెళ్ళి చేసుకోకూడదు.

పెళ్ళిచేసుకొని తనవ్యక్తిత్వాన్ని పోగొట్టుకోకూడదు.

పెళ్ళి చేసుకొని తనూ సిగ్గు ఎగ్గూ విడిచి పెట్ట కూడదు.

అయితే ఏం చేయాలి?

ఏర్పాట్లన్నీ జరిగాయి నిమిషాల్లో కొబ్బరాకుల పందిరి వేశారు. రాటలకు పచ్చి కొబ్బరాకుల చుట్టారు. మామిడాకు తోరణాలు కట్టారు. ఊరందరికీ భోజనాలు

చెప్పారు. ఆ మరునాడు వుదయం నించీ ఏవేవో సినిమా పాటలతో వీధి వీధంతా హోరెత్తి పోయింది. అయిన వాళ్ళూ, ఆప్తులూ పిండి వంటలతో భోజనాలు చేశారు.

శాస్త్రి మనసు తుక తుక ఉడికిపోయింది. విషం దొరికితే బావుండను కున్నాడు. గట్టిగా గొంతెత్తి నలు గురిలోనూ అల్లరి చేద్దామనుకున్నాడు. అందరూ తనను అతి గౌరవంగా పలకరించి, బాగోగులు మాట్లాడుతున్నప్పుడు అతను పిచ్చి పిచ్చి వేషాలు వేయలేక పోయాడు.

ముహూర్తం వేళకు శాస్త్రి పెళ్ళి కూతురు మెడలో మూడు ముళ్ళూ వేయక తప్పలేదు.

బాజాలు మోగాయి.

పెళ్ళి కూతురు అతి హుషారుగా తలంబ్రాలు పోసింది.

గృహప్రవేశ సమయానికిగాని అతనికి మరదలి పేరు తెలీలేదు.

"కామాక్షీ నేనూ వొచ్చాం." అని శాస్త్రి ఎంతో బాధగా అసహ్యంగా మెల్లగా, సిగ్గుపడిపోతూ చెప్పినపుడు అమ్మలక్కలు కిసుక్కున నవ్వారు.

మర్నాడు సత్యనారాయణ వ్రతం.

ఆ తరువాత రెండురోజులకు రాత్రి పది దాటిన తరు వాత, శాస్త్రి పూలపరిమళం అలుముకున్న శోభనం గదిలో

తెల్లటి దుప్పటిమీద తెల్లటి దుస్తులతో అసహ్యంగా అటు తిరిగి పడుకున్నాడు.

తలుపు గడియ పడింది.

కామాక్షి చాలాసేపు తలుపు దగ్గరే నిలబడింది.

ఒకసారి శాస్త్రి తలెత్తి చూచాడు.

అతనికి కామాక్షి మీద బోలెడంత కోపం వచ్చింది. పళ్ళు పట పట కొరికాడు ఆ పిల్ల చాలాసేపు నిలబడి మెల్లగా మంచం దగ్గర కొచ్చింది.

ఎంతకూ శాస్త్రి పలకరించకపోయే సరికి ఏం చేయాలో తోచిందికాదు.

మెల్లగా తన చేతిని అతని భుజం మీద వేసింది.

శాస్త్రికి ఎక్కడలేని కంపరం పుట్టుకొచ్చింది, ఆ చేతిని విసిరికొట్టాడు.

"అదేమిటి బావా! ఎంత కోపమైతే మటుకు అలా ముడుచుకు పడుకుంటే—తలుపు సందుల్లోంచి చూస్తున్న వాళ్ళే మనుకుంటారు?" అనడిగింది కామాక్షి.

అయినా శాస్త్రి గోడవైపే చూస్తూ పడుకున్నాడు.

"పాలుతాగు బావా!" అంది కామాక్షి.

అయినా అతను కిమ్మనలేదు.

మంచం మీద కూచుని, అతన్ని తన వైపు తిప్పకో బోయింది. అతను చటుక్కున లేచి కూర్చున్నాడు.

"ఇదిగో పిల్లా! ఇవేం నాకు నచ్చవ్. ఇలా చేయడం నాకసహ్యం. నాకసలు పెళ్ళంటే రోత. అయినా మీరంతా

కలిసి ఎందుకూ పనికిరానివాణ్ని చేశారు. నువ్వు ఈ ప్రేమా గీమా నటించకు. ఒళ్ళు తీవరం కాకపోతే ఈ వెధవ్వేషాలేమిటి? ఆ పాలేవో తాగి మెదలకుండా పడుకో" అనేసి గోడవైపు ముఖం పెట్టుకు పడుకున్నాడు శాస్త్రి.

కామాక్షి బిక్క చచ్చిపోయింది. మరేం మాట్లాల్లేదు. ఆ పిల్ల శరీరంలోని పడుచుదనం వేడంతా క్షణాల్లో దిగిపోయింది.

మెదలకుండా పడుకుంది.

ఓ రాత్రి వేళ శాస్త్రికేదో పీడకల వొచ్చినట్టుంది "వద్దు...నాకొద్దు— నాకసహ్యం... పో— దూరంగా పో." అంటూ గట్టిగా అరుస్తూ లేచి కూచున్నాడు.

కామాక్షి అదిరిపడి లేచింది.

"ఏమండి ఏమైంది?" అనడిగింది.

సన్నటి కిరసనాయిలు దీపం వెలుగులో శాస్త్రి ఆ పిల్ల ముఖంలోకి చూశాడు.

నిద్రతో మత్తిల్లిన కళ్ళు, నున్నటి చెక్కిళ్ళు, అందమైన ఎర్రటి పెదాలు, పమిట జారి బయట పడ్డ వక్షం మీద ఎదిగిన ఎత్తులు—అమాయకత్వం. అందం శాస్త్రి మనస్సును ఒక్క క్షణం ఊపి వేశాయి. అతను నిగ్రహించుకోలేకపోయాడు. మనస్సు తుఫానునాటి సముద్రమైపోయింది.

రెండు చేతులూ చాచి, ఒక్కసారిగా కామాక్షిని గాఢంగా కావలించుకొని మెల్లగా మెత్తగా "కామూ?" అని పిలుద్దామనిపించింది. మరుక్షణంలోనే అతను మామూలు శాస్త్రయిపోయాడు.

కొంచెం తడబాటు కలిగింది.

ఏం మాట్లాడకుండానే, అటు తిరిగి పడుకున్నాడు.

కామాక్షి ఎన్నో కథలు చదివింది, ఎన్నో కలలు కంది. తొలిరాత్రి మాధుర్యాన్ని చవి చూచిన ఆమె స్నేహితురాళ్ళు చెప్పిన కమ్మని కథలు వింది.

తన వరకూ వచ్చేసరికి తలకిందైన తన కలల్ని తలుచుకొని, ఆమె ఒక నిట్టూర్పు విడిచింది

తెల్లవారుజామున అతనికి మళ్ళీ మెలుకువ వచ్చింది. కామాక్షి చేయి అతని కంఠాన్ని ఆప్యాయంగా కౌగలించుకుంది. అతను తాచుపామును చూసినట్టు దడుసుకున్నాడు. మెల్లగా ఆ పిల్ల చేతిని తప్పించి, తలగడ మీద మోపి, తలుపు తెరుచుకుని బయటికి వచ్చాడు.

కామాక్షి స్పర్శ అతనికి బాగానే పుట్టిస్తున్నా, లోపల గూడుకట్టుకున్న అసహ్యంవల్ల. ఆడవాళ్ళంటే అతనికి ఏర్పడ్డ జుగుప్సవల్ల అతను తనలో కలిగిన కోరిక గొంతు నొక్కేశాడు.

బయటగాలి చల్లగా వుంది. పడిమీద గోడకు మెల్లగా జారగిలపడ్డాడు మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు.

అప్పుడే లేచిన అత్తగారు అతన్ని చూసింది. పూర్ణయ్యా చూశాడు వాళ్ళిద్దరూ జరిగిందేమిటో తెలీక కొంచెం తికమక పడ్డారు.

కామాక్షికి మెలకువొచ్చాక అతను కనిపించలేదు. కంగారుపడింది. కళ్ళు నులుముకుంటూ బయటికొస్తున్న కూతుర్ని చూసింది రాజ్యలక్ష్మి.

తల్లి కనిపించగానే సిగ్గుపడింది.

"ఏమే మీ ఆయన బయట పడుకున్నాడేమిటి!" అడిగింది రాజ్యలక్ష్మి. కామాక్షి కేంచెప్పాలో తోచలేదు.

"రాత్రంతా ఉక్కపోస్తోందని గోలపెట్టారు పాపం! తెల్లవారుజామున బయటికొచ్చి పడుకున్నట్టున్నారు..." అంది.

రాజ్యలక్ష్మి కూతురును దగ్గరకు తీసుకొని, మెత్తగా ఆ పిల్ల బుగ్గమీద ముద్దుపెట్టింది. కామాక్షి సిగ్గుపడి పోతూ మెల్లగా కౌగిలి తప్పించుకొంది.

ఆ వేళకు శాస్త్రికి మెలకువ వచ్చేసింది. చల్లగా స్నానం చేశాడు. ఉప్మాలో జీడిపప్పొకటి ఏరుకుని పళ్ళ మధ్య ఇరికించి, ఆలోచనలో మునిగాడు శాస్త్రి. ఎదురుగా కూర్చున్న పూర్ణయ్యా ముఖాన్ని ఓసారి చూసి, "ఇవాళ మధ్యాహ్నం బయలుదేరుతాను" అన్నాడతను.

పూర్ణయ్యా ఆశ్చర్యంగా చూశాడు.

"ఇంకా నాలుగు రోజులు శలవుంది గదటోయ్" అన్నాడతను.

"శలవకేమి! రేపెప్పుడైనా అవసరమైతే కష్టం. వెళ్ళి కౌన్సిల్ చేసుకుంటే, మళ్లీ అవసరమైనపుడు పెట్టుకోడానికి వీలవుతుంది"

పూర్ణయ్యకేం చెప్పటానికీ తోచలేదు. లోపలికెళ్ళి భార్యనీ, కూతురినీ విడివిడిగా సంప్రదించాడు. వార్త విన్న వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు. ముఖ్యంగా కామాక్షి!

ఏమయితేనేం, ఆ పూట భోజనంచేసి శాస్త్రి బయలుదేరాడు.

రాత్రి పదిగంటలవేళ అతను తన గది చేరుకునిముఖం చేతులు కడుక్కుని కిటికీలోంచి ఆ చీకట్లో ఏమీ ఎరగనట్లు, నిలబడ్డ అశోక వృక్షంవంక జాలిగా దీనంగాచూస్తూ జరిగిపోయిన ఘోరప్రమాదాన్ని తలచుకొంటూ కూర్చుండిపోయాడు. జరిగినదంతా అతనికి ఒక కలలా వుంది. కలైతే బావుండిపోను, కలకాదు. వేలికి బంగారంబటువు స్పష్టంగా వెన్నెల వెలుగులో మెరుస్తూ కనిపిస్తోంది. ఇది నిజం కాకపోవడమేమిటి! నిజమే, అక్షరాలా నిజం. తనకు పెళ్ళయింది. తను కామాక్షి మెడలో మూడుముళ్ళూ వేశాడు. ఈ విధంగా తను పతనమైపోయాడు ఇంతే! ఈ బ్రతుకింతే!

అతనికళ్ళలో నీళ్ళు తిరిగాయి. కిటికీ అంచుమీద తలపెట్టి, అతను ఊచల సందునుంచి దీనంగా బయటకు చూశాడు.

తను వచ్చేముందు కామాక్షి తనతో ఏదో చెప్పాలని తాపత్రయపడింది. అందుకు తను అవకాశమివ్వలేదు. ఆ పిల్ల ఏమని చెప్పివుండేదో రెండెడ్ల బండెక్కుతున్నవుడు గదిలో కిటికీలోంచి కన్నీరోడుతున్న కళ్ళతో ఆ పిల్ల కనిపించడం అతనికి జ్ఞాపకం వచ్చింది.

అప్పుడతనికి ఏం అనిపించలేదు.

ఇప్పుడుమాత్రం మనసు చెమ్మగిల్లింది.

పాపం! ఆ పిల్ల ఏం తప్పుచేసింది? అందరిలాగా ఆ పిల్ల పెళ్ళిచేసుకుంది. కాని—తనెందుకు చేసుకోవాలి.

తాను దౌర్భాగ్యుడు. తనకు సుఖంలేదనేది స్పష్టం. తనవల్ల మరెవరికీ సుఖంలేదు. తాను దురదృష్టవంతుడు కనుకనే అమ్మా, నాన్నా చనిపోయారు. తన దురదృష్టం కామాక్షికి కూడా పట్టుకోవాలా. కామాక్షి దురదృష్టవంతురాలు కాకపోతే తానెందుకు కామాక్షిని చేసుకుంటాడు ?

శాస్త్రికి చాలా జాలివేసింది. తనమీద తనకే జాలి వేసింది. కొంచెం కోపంకూడా వచ్చింది. అరచేత్తో నుదుటమీద నాలుగుసార్లు మోదుకున్నాడు.

ఆఫీసులో జనానికి శాస్త్రిమీద అనుమానం వచ్చింది. వారంరోజుల్లోనే శాస్త్రి బుగ్గలు కొంచెం నును పెక్కాయి. ఎప్పుడూ హోటలు తిండికే అలవాటుపడిపోయిన అతని నాలిక కోనసీమ తిండికి పులకరించింది. ఆ

విధంగా అతను అక్కడున్నన్ని రోజులూ రెట్టింపు తిండి తిన్నాడు అదంతా రక్తమై అతనిలో కొత్త ఉత్సాహాన్ని పుట్టించింది.

పెళ్ళాన్ని తలుచుకున్నప్పుడు శాస్త్రికి కొంచెం గర్వం కూడా కలుగుతూ వచ్చింది. తన పెళ్ళాం బంగారు బొమ్మ. నూటికి పదిమందిలో మాత్రం అందం కనిపిస్తుంది. చక్రాల్లాంటి కళ్ళు, సన్నటి ముక్కు, అందమైన పెదాలు— ఇవి జ్ఞాపకం వచ్చినప్పుడు వెంటనే అతనికి శోభనం నాటి తెల్లవారుఝామున కామాక్షి తన కంఠం పైన చేయేసుకు పడుకోవటం గుర్తొచ్చి అతను పులకించి పోయేవాడు. ఆ వెనువెంటనే తనిలా క్రమంగా కామాక్షివైపు ఆకర్షింపబడుతూ ఉన్నాడని గ్రహించి సిగ్గుపడేవాడు కోపంతో తల బాదుకునేవాడు.

ఆరోజు అయ్యరు కంది పచ్చడి చేశాడు. అద్భుతంగా ఉంది. ముద్దమీద ముద్ద తింటున్నాడు. ఎప్పుడూ లేనిది తింటూ తింటూ సర్వర్ తో వేళాకోళం ఆడేడు.

వాడు ఆశ్చర్యపోయి చూశాడు.

ఎప్పుడూ నోరెత్తని వాడు ఇలా మారిపోయాడేమిటా అని వాడికి గొప్ప ఆశ్చర్యం కలిగించటంలో తప్పు లేదు.

శాస్త్రికి వెంటనే అప్పనపల్లి గుర్తొచ్చింది. అత్తారింట్లో కంది పచ్చడి గుర్తొచ్చింది. ఆ వెను వెంటనే కామాక్షి కళ్ళముందు కదిలింది.

తను బండెక్కేటప్పుడు కిటికీలోంచి కన్నీళ్ళు కారుతున్న కళ్ళతో జాలిగా దీనంగా చూస్తున్న కామాక్షి తలపుకు రాగానే అతనికి తనమీద తనకే కోపం వచ్చింది.

తను నిజంగా మూర్ఖుడు ఒక అమాయకురాలి మనస్సుని బాధపెట్టే అర్హత తనకు లేదు. బంగారు బొమ్మలాంటి భార్యని పువ్వుల్లో పెట్టి పూజించుకోవలసింది పోయి ఒట్టి పల్లెటూరి గబ్బిలాయిలాగా, చదువురాని మూర్ఖుడిలాగ మనసు విప్పి మాట్లాడ్డం చేతగాక, తొలిరాత్రి ఆదరంగా అభిమానంగా అత్యంత ప్రేమతో చేరబోతే కౌగిట్లోకి తీసుకోడానికి మనసులేక తనెంత గొప్ప తప్పిదం చేశాడో తెలిసి అతను ఎంగిలి చేతితో తలబాదుకున్నాడు. అది చూసిన సర్వర్ కి మరీ మతిపోయింది. తను చేసిందేమిటో తెలుసుకొని, శాస్త్రి క్షణం బిత్తరపోయి గబగబా చేయి కడుక్కోడానికి లేచి వెళ్ళాడు.

రోజులు గడుస్తున్నాయి. తెల్లవారగానే ఆఫీసు గుర్తొస్తుంది. చీకటి పడగానే అతనికి కామాక్షి గుర్తొస్తుంది. మామగారు ఎన్ని ఉత్తరాలు రాసినా శాస్త్రి సమాధానం రాయలేదు. రాద్దామని కూచునే వేళకు రేపు రాద్దాములే అనిపించేది. అయినా ఏం రాస్తాములే అనిపించేది.

నేను రాలేకపోతే మటుకు ఏమౌతుందిలే అనికూడా అతననుకునేవాడు.

ఉత్తరాలు రాయటం అంది పుచ్చుకోవటంలోని అందచందాలు అందరికీ తెలీవు మరి.

ఒకరోజు రాత్రి అతను కిటికీ దగ్గర కూచుని చెట్ల వంక చూస్తూ ఆలోచించుకుంటున్నప్పుడు తలుపు తోసినట్లనిపించింది. గాలి కాబోలు ననుకొన్నాడు ఎవరిదో అడుగుల చప్పుడైంది. అయినా ఎవరొస్తారులే అనుకొన్నాడు.

"ఏమయ్యా ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదూ?"

శాస్త్రి గుండె గతుక్కుమంది. చటుక్కున లేచి నుంచున్నాడు.

"ఇదేనా రావటం?" అనడిగాడు శాస్త్రి.

"రావటం మధ్యాహ్నమే వచ్చాం. ముందు నా ప్రశ్నకి సమాధానం చెప్పు" అని మొరాయించాడు పూర్ణయ్య.

శాస్త్రి మ్మె మ్మె మ్మె అంటూ—

"ఒంట్లో బావుండక..." నీళ్ళు నమిలేశాడు.

"ఒంట్లో బావుండకపోతే—ఓ కార్డుముక్క రాయడానికేం—అమ్మాయిని పంపించేవాణ్ణిగా!"

శాస్త్రికి గొప్ప అనుమానం వచ్చింది. "రావటం మధ్యాహ్నమే వచ్చాం" అన్నాడు పూర్ణయ్య అంటే ఊరినుంచి నలుగురైదుగురు స్నేహితులు వచ్చుండాలి. తను పెళ్ళయిన వెంటనే మాటా మంచీ లేకుండా పారిపోయినట్టు వచ్చేసి ఆ తరువాత ఉత్తరం పత్తరం లేకుండా మౌనం వహిస్తే ఇప్పుడీ పెద్దలంతా పంచాయితీ చేసి నాకు తగిన శిక్ష వేస్తారు కాబోలు, హారి భగవంతుడా! నేను

శ్రీకాకుళం

కథా నిలయం
1596

దొరికిపోయాను. ఇంక వీళ్ళు నన్ను గోతిలోకి దింపేస్తారు. కామాక్షి నిజం చెప్పేసుంటుంది. అదంటే సీతరాముడూ నా కిష్టంలేదని నమ్మి వీళ్ళంతా నా మీదకి దండయాత్ర చేశారు అనుకున్నాడు శాస్త్రి.

"గదికి తాళం వేసి పద" అన్నాడు పూర్ణయ్య.

గదికి తాళం వేస్తున్నపుడు శాస్త్రి చేతులు ఒణికాయి.

"నేను మళ్ళీ కులాసాగా తిరిగి రాగలనా?" అనుకుని ఏడుపు ముఖం పెట్టాడు.

రిక్షామీద యిద్దరూ శాస్త్రి వాళ్ళ ఆఫీసుకు దగ్గర ఓ యింటి దగ్గర దిగారు.

గుమ్మంలో ఒకావిడ భుజాలమీద కొంగు కప్పుకుని నిలబడుంది. శాస్త్రిని చూడగానే లోపలకు వెళ్ళిపోయింది.

ఆ యిల్లెవరిదో శాస్త్రికి అర్థం కాలేదు. ప్రశ్నార్థకంగా పూర్ణయ్యను చూసేడు.

"నడవ్వయ్యా లోపలికి నడు" అన్నాడు గాని పూర్ణయ్య లోపలికి రాలేదు.

శాస్త్రి బితుకు బితుకుమంటూ లోపలికొచ్చాడు. అక్కడ గది గుమ్మం దగ్గర లైటు వెలుగులో కామాక్షి కన్పించింది. శాస్త్రి ముఖం ఒక్కసారి ఆనందంతో వెలిగింది. కామాక్షి! అవును తన పెళ్ళామే. అడుగుముందుకు వేయబోయి ఆగిపోయాడు.

కామాక్షి ఎందుకు వచ్చినట్టు?

తనను వీళ్ళంతా సముద్రంలోకి తోసేస్తారు. తాను మునిగిపోతాడు.

కామాక్షే తండ్రికి ప్లాను చెప్పివుంటుంది.

గదిలో ఇద్దరూ కూచున్నారు.

"మధ్యాహ్నమే వచ్చాం మేం. ఈ గది వసారా అద్దెకు మాట్లాడారు నాన్నగారు. మీరాగది వదిలేసి. రేపొద్దుట సామానంతా తెచ్చేయండి" అంది కామాక్షి.

గది తలుపులు దగ్గరగా వేసి మెల్లగా శాస్త్రిప్రక్క జేరి "ఇప్పటికయినా మీ కోపం పోయిందా?" అనడిగింది.

శాస్త్రి చటుక్కున లేచి బయటికొచ్చేశాడు, బయట అరుగుమీద పూర్ణయ్య నిద్రకు జారుకుంటున్నాడు. అలికిడికి మెల్లగా తలెత్తి "మా భోజనాలన్నీ అయ్యాయి. ఇప్పుడు గదికేం వెడతావు గానీ ఇక్కడే పడుకో లోపలికి వెళ్ళి తలుపు గడియపెట్టు" అనేసి ఆయన మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

* * * *

శాస్త్రికి ఇప్పుడు నలుగురాడపిల్లలూ, ఇద్దరబ్బాయిలూను. పెద్దమ్మాయి వసంతకు కిందటేడాదే పెళ్ళయింది. పెళ్ళికి ముందు వసంత "నేనసలు పెళ్ళిచేసుకోను మొర్రో!" అని మొత్తుకుంది. శాస్త్రి పాపం చాలా ఓపిగ్గా పెళ్ళాడితే కలిగే లాభాలు సుఖాలు వివరించి చెప్పాడు. అయినా

ఒకంతట ఆ పిల్ల వినలేదు. కోప్పడి బెదిరించి ముహూర్తం వరకూ గదిలో పెట్టి తాళం వేసి కడకు పెళ్ళి చేశాడు.

ఆ పిల్లకో ఆడపిల్ల. రెండు నెల్ల మనవరాలితో ముచ్చట్లాడుకుంటూ శాస్త్రి సంతోషపడి పోతున్నాడు. పాపం! అతనికిప్పుడు క్షణం తీరికలేదు. పిల్లల్ని చూసుకోవాలి. కామాక్షికి కోపం రాకుండా వాళ్ళని సముదాయించి, బట్టలు తొడిగి, పలకా బలపం యిచ్చి బళ్ళోకి పంపాలి. కాలేజి చదువుల వాళ్ళని వేళకు కాలేజికి తోలాలి. మధ్య మధ్య మనుమరాలిని ముద్దాడాలి. ఇదంతా అయిన వెనుక ఆదరా బాదరా రెండు మెతుకులు కతికి ఆఫీసుకు పరుగెత్తాలి.

క్షణం నిలబడ్డానికి తీరిక లేని మనిషికి ఆలోచించడానికి అవకాశం ఎక్కడిది? సాయంకాలం బజారుపనులు యింటావిడ పురమాయించే మరేవయినా పనులు. రాత్రి భోజనాల వేళవరకూ వీటితోనే సరిపోతుంది. భోజనం కాగానే నిద్ర.

శాస్త్రి కిప్పుడు ఏ దిగులూ లేదు. జీవితం అతనితో ప్రమేయం లేకుండా దాని దారిన అది నడిచిపోతోంది.

ఎటొచ్చీ ఎప్పుడేనా తాను ఒంటరిగా బ్రతికిననాటి ఆలోచనలు జ్ఞాపకం వచ్చినపుడు మాత్రం అప్పటి తన తెలివితక్కువ తనానికి జాలిగా నవ్వుకుంటాడు

ఇప్పుడు రెండో పిల్లకు పెళ్ళి సంబంధాలు వెతుకుతు

న్నాడు శాస్త్రి. రెండోదానికి పెళ్ళయిపోతే మరి మూడేళ్ళ దాకా మిగతా వాళ్ళ వీపయంలో బాధపడనవసరం లేదు.

ఒకనాడెప్పుడో శాస్త్రికి కొంచెం ఆలోచించుకోడానికి తీరిక చిక్కినప్పుడు పన్నెండేళ్ళ వాడు తన పెద్దకొడుకు—ఆలోచనలు ఏ విధంగా ఉంటాయోనని అతనికి అనుమానం వచ్చింది.

"బహుశా వాడికి నా ఆలోచనలు వచ్చుండవు. వాళ్ళమ్మలాగా వాడు తెలివయినవాడు" అనుకున్నాడు.

ఆ వెంటనే అతనికి మరో విషయం జ్ఞాపకం వచ్చింది పెళ్ళికాకముందు అతను విపరీతమైన ఆలోచనలతో సతమతమయి పోయేవాడు. క్షణం తీరిక లేకుండా ఏవేవిటో ఆలోచిస్తూ మనశ్శాంతి లేకుండా చేసుకునేవాడు. బ్రతుకంతా నిరాశా నిస్పృహాలతో నిండినట్టు దుఃఖమే తప్ప జీవితంలో మరేం లేనట్టూ అనిపించేది. ఆనందం అంటే భయం వేసేది. ఆడవాళ్ళంటే కలిగిన అసహ్యంవల్ల మనుషులంటే కలిగిన ద్వేషంవల్ల మనసంతా కలుషితమై పొయ్యేది. తన శక్తి సామర్థ్యాల మీద నమ్మకం లేని మనిషి ఆనందాన్ని అందుకోడానికి ముందుకు రాలేడని అతని కిప్పుడిప్పుడు అర్థమౌతోంది.

కామాక్షితో కాపరం పెట్టాక, అంతకుముందు కనిపించని ఆనందమంతా కళ్ళముందు పడింది. శ్రమెక్కువైనా అందులో ఎంతో సంతృప్తి కనిపిస్తూంది. ఒక బాధ్యత

సుస్పష్టంగా కంటికి కనిపిస్తున్నప్పుడు మనిషికి బాల్య తనం జ్ఞాపకం రాదు. ఏదో విధంగా ఆపని పూర్తి చేయ వాలన్న తపన తప్ప మరో ధ్యాసే వుండదు. సంసారాన్ని సాగరంతో ఉపమానించిన పెద్దల అభిప్రాయమేమిటో శాస్త్రికి స్పష్టం కాలేదుగాని—అతనికిప్పుడు ప్రపంచ సాగరంలోనే సుఖ సంతోషాలున్నట్టు అనుభవం నేర్పింది.

ఇదంతా నెమరువేసుకున్నప్పుడు శాస్త్రి గర్వంగా రొమ్ము విరుచుకుని, ఓ చిరునవ్వు నవ్వుకున్నాడు.

(జ్యోతి జూన్ 70